

ఉన్నదానిని
నిరాకరించడమే సంఘర్షణ
ఉన్నదానిని
తప్పించుకొని పారిపోవడమే
సంఘర్షణ


# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA AUG. 2011 - NOV. 2011 Rs.2/- VOL.VI ISSUE 1


# ఆవరించుకుంటున్న అపార శూన్యత

ఆ చెట్టు కంటె అందమైనది మరొకటి ఏదీ ఈ భూమండలం మీద లేదు. చెట్టు చనిపోయాక కూడా ఇంకా అందంగా ఉండిపోతుంది. పత్రవిహీన లైన కొమ్మలన్నీ ఆకాశంకింద పరచుకొని ఉంటాయి. సూర్యకాంతి పడి రంగు పోగొట్టుకొని వెలిసిపోతాయి. ఆ నగ్న శాఖల మీద పక్షులు విశ్రాంతి తీసుకుంటుంటాయి.................... అయితే ఇప్పుడు చెట్టు ప్రాణంతో ఉన్నది. అచ్చెరువు గొలిపేటంత అందంతో విలసిల్లుతున్నది. చిక్కని నీడలు పరిచింది. సూర్యుని ఉగ్ర కిరణాలు మనల్ని అంటవు. అక్కడ కూర్చుని గంటలు గడిపేయచ్చు. బ్రతికి వున్నవాటినీ, చనిపోయిన వాటినీ బాహ్యంగానూ, లోపలగానూ – అన్నింటినీ చూడచ్చు, వినచ్చు. లోపలగా వెళ్ళి సంచరించకుండా బాహిరాన్ని మాత్రమే చూడటం, వినడం సాధ్యపడదు. నిజంగా చూస్తే బాహ్యరంగమే అంతరంగం, అంతరంగమే బాహ్యరంగం. ఆ రెండింటిని వేరు పరచడం కష్టం. ఒక రకంగా అది అసాధ్యం. అద్భుతమైన ఈ చెట్టును మీరు చూస్తూ వుంటారు. ఎవరు ఎవరిని చూస్తున్నారు అని ఆశ్చర్యం వేస్తుంది. అంతలోనే చూస్తున్నవాడు (ద్రష్ట) లేకుండా పోతాడు. ప్రతి ఒక్కటీ తీక్షణమైన సజీవతతో తొణికిసలాడుతున్నది. అక్కడ ఉన్నది ఒక్క ప్రాణం మాత్రమే. గమనించేవాడు ఆ రాలిన ఆకు లాగే మరణించాడు. చెట్టుకు, పక్షులకు, వృక్ష ఛాయలో కూర్చున్న ఆ మనిషికి, సమృద్ధవంతమైన ఆ నేలకు మధ్యన విభజన రేఖ ఏదీ లేదు. ఆలోచనా రహితమైన సద్గుణశీలత అక్కడ ఉన్నది. అందుచేత క్రమత ఉన్నది. క్రమత శాశ్వతమైనది కాదు. అది ఒక్కొక్క క్షణమే వుంటూ ఉంటుంది. సూర్యాస్తమయంతో పాటు ఎంతో సర్వసాధారణమైనట్లు వచ్చేస్తుంది ఆ అపారతత్వం. ఎంతో హాయిగా ఆహ్వానిస్తూ వస్తుంది. చీకటి పడుతుండటం వల్ల పక్షులు మౌనం దాల్చాయి. మెల్లమెల్లగా చప్పుళ్ళన్నీ తగ్గిపోతూ ఉన్నాయి. రాత్రి వేళకు అంతా సిద్ధమవుతున్నది. మహాద్భుతమైన, సున్నితమైన, సజీవమైన ఈ మెదడు పూర్తిగా నిశ్చలమై పోయింది. ఊరికే గమనిస్తూ, వింటూ ఉన్నది. ఒక్క క్షణం పాటు కూడా ప్రతిచర్య చూపకుండా, ఏదీ ముద్రించుకోకుండా, ఏ అనుభవమూ పొందకుండా కేవలం చూస్తున్నది, వింటున్నది. ఆ అపారతత్వంతో పాటుగా ప్రేమ ఉన్నది. వినాశనమూ ఉన్నది. దరిచేరలేనటువంటి బలం కలది ఆ వినాశనం. ఇవన్నీకేవలం మాటలు. ఆ నిర్జీవ వృక్షం లాగా. ఒకప్పుడు ఉన్న దాని చిహ్నం అది. ఇక అది ఉండనే ఉండదు. అది వెళ్ళిపోయింది. ఆ పదం–మాట నుండి దూరంగా వెళ్ళిపోయింది. ఆవరించి, ముంచివేస్తున్న శూన్యతను మాట ఏనాటికీ పట్టుకోలేదు. మాటకు ప్రాణం లేదు, నిర్జీవం. ఆ అపారమైన శూన్యతలో మాత్రమే ప్రేమ ఉంటుంది. ఆ ప్రేమలో మాత్రమే అమాయకత్వం ఉంటుంది. ఆ ప్రేమను గురించి మెదడుకు ఎలా తెలుస్తుంది? ఎప్పుడూ పనిచేస్తూ, క్రిక్కిరిసిపోయి, జ్ఞానభారాన్ని, అనుభవాలను మోస్తూ ఉండే మెదడుకు అది సాధ్యమా? అది ఉండాలి అంటే అన్నింటినీ వర్జించాలి.

*('కృష్ణమూర్తిస్ నోట్ బుక్' నుండి; పుటలు 214-216)*

# ఏ అంశాన్నైనా, అందులో వున్న సమస్తాన్నీమానసికంగా పూర్తిగా గ్రహించుకోగలుగుతామా?

**ఒకరి ప్రశ్న:** గ్రాహ్యత అనే మాటకు బదులుగా మీరు అనేక ఇతర పదాలు కూడా వాడుతుంటారు. ఒక్కొక్కసారి 'గ్రాహ్యత' అనే అంటారు కానీ మళ్ళీ 'పరిశీలించు', 'చూడు', 'అర్థం చేసుకో', 'ఎరుకగా వుండు' అనే మాటలను కూడా అదే అర్థంలో మీరు వుపయోగిస్తూ వుంటారు. ఈ మూడు పదాలనూ ఒకే అర్థంలో వుపయోగిస్తున్నారని నేను అనుకుంటున్నాను. స్పష్టంగా, సంపూర్తిగా, సమస్తంగా చూడటం అనే అర్థంలో. అసలు దేనినైనా సంపూర్ణంగా, అందులో వున్న సమస్తాన్నీ మనం చూడగలుగుతామా? భౌతికమైన వస్తువుల విషయం కాదు. సాంకేతిక విషయాలూ కాదు. మనం మాట్లాడుతున్నది వాటిని గురించి కాదు. దేనినైనా సరే అందులో వున్న సమస్తాన్నీ మానసికంగా పూర్తిగా గ్రహించుకో గలుగుతామా, అర్థం చేసుకోగలుగుతామా? కొంత కొంత ఏదో ప్రచ్ఛన్నంగా దాగి వుండదూ. అందుచేత పాక్షికంగానే

☞ 4

# దుఃఖ సమాప్తి
## “మన అందరిలోనూ దుఃఖం వున్నది”

ఈ వుదయపు సమావేశంలో దుఃఖం గురించి మాట్లాడాలనుకుంటున్నాను. ఇది చాలా క్లిష్టమైన సమస్య. ఈ సమస్యను అతి వివరంగా పరిశీలించి చూడటం సాధ్యపడదు కాబట్టి, మీరు అనుమతి ఇస్తే, దుఃఖంలో వున్న ప్రధాన అంశాలను మాత్రం పరిశీలించదలుచుకున్నాను.

దుఃఖాన్ని అవగాహన చేసుకోకుండా వివేకం రాదు. దుఃఖాన్ని అంతం చేయడమే వివేకానికి ఆరంభం అవుతుంది. దుఃఖాన్ని అవగాహన చేసుకొని, దాని నుంచి పూర్తిగా విడుదల చెందాలంటే ఒక్కొక్క ప్రత్యేకమైన వ్యక్తిగత మైనటువంటి దుఃఖాన్నే కాకుండా, సమస్త మానవాళినీ ముంచెత్తివేస్తున్న ఆ మహాబాధా పూరితమైన దుఃఖాన్ని కూడా అవగాహన చేసుకోవడం అవసరం. దుఃఖం నుంచి సంపూర్ణంగా విముక్తి చెందకపోతే వివేకం వుండదని నాకు అనిపిస్తున్నది. దేవుడు అని కానీ, లేక మరి ఏ పేరుతో పిలిచినా సరే, ఆ అప్రమేయమైనదానిలోకి నిజమైన విచారణ జరిపే శక్తి మనసుకు వుండదని కూడా నాకు అనిపిస్తున్నది.

మన అందరిలోనూ దుఃఖం వున్నది. అయితే అది రకరకాల రూపాలలో వుంటుంది. బాంధవ్యాలలోనో, సన్నిహితుల మరణం కారణంగానో, తమని సఫలీకృతులను చేసుకోలేక వాడి వదలిపోయి వట్టి శూన్యంగా మిగిలిపోవడంలోనో, ఏదో సాధించాలనే ప్రయత్నంలోనో, పూర్తిగా పరాజయం పొందినప్పుడో దుఃఖాన్ని చవిచూసి వుంటారు. ఇక, దేహసంబంధిత విషయంగా కూడా దుఃఖం అనే ఒక పెద్ద సమస్య వున్నది. వ్యాధి, అంధత్వం, అవయవాలు పనిచేయకపోవడం, పక్షవాతమూ మొదలయినవి. ఎక్కడ చూసినా దుఃఖం అనే ఈ విపరీతమయిన సంగతి ఒకటి వున్నది. పైగా మృత్యువు ఎప్పుడూ పొంచి చూస్తూనే వుంటుంది. ఈ దుఃఖాన్ని ఎట్లా ఎదుర్కొనాలో మనకు తెలియదు. అందుచేత కొందరు దానిని ఆరాధిస్తారు. దాని కారణాలు వెతికి తృప్తిపడతారు. లేకపోతే దాని నుంచి పారిపోవాలని ప్రయత్నిస్తారు. ఏ చర్చికి వెళ్ళినా అక్కడ క్రైస్తవులు దుఃఖాన్ని ఆరాధించడం చూడవచ్చు. దుఃఖాన్ని అది ఏదో అపురూపమైన, పవిత్రమైన విషయం అన్నట్లుగా రూపొందించారు. దుఃఖం ద్వారా మాత్రమే, శిలువ వేసిన ఏసుక్రీస్తు ద్వారా మాత్రమే దైవాన్ని చేరవచ్చని వారు అంటారు. తూర్పు దేశాలలో కూడా ఈ తప్పించుకునే మార్గాలూ, దుఃఖం నుంచి పారిపోవడానికి ఇతర విధానాలూ వున్నాయి. పశ్చిమ దేశాలలో కానీ ప్రాక్ దేశాలలో కానీ దుఃఖాన్నుంచి నిష్కృతి పొందినవారు చాలా కొద్దిమంది మాత్రమే వుండటం నాకు చాలా ఆశ్చర్యకరమైన సంగతిగా అనిపిస్తున్నది.

ఈ వుదయం, ఇక్కడ చెప్తున్నది వింటున్నప్పుడు, వినడం అనే ఆ ప్రక్రియ జరుగుతున్నప్పుడు, అయితే ఏ మనోద్రేకాలకూ లోను కాకుండా వుద్విగ్నరహితంగా మీరు వింటూవున్నప్పుడు, ఈ ప్రసంగస్థలం విడిచి వెళ్ళేలోగా మీరు నిజంగానే దుఃఖాన్ని అవగాహన చేసుకోగలిగితే, పూర్తిగా దుఃఖవిముక్తిని పొందగలిగితే ఎంతో అద్భుతంగా వుంటుంది. ఎందుకంటే, అప్పుడిక ఆత్మవంచనలూ, భ్రమలూ, భ్రాంతులూ, ఆందోళనలూ, భయాలూ ఏవీ వుండవు. అప్పుడు మెదడు స్పష్టతతో, సునిశితంగా, తర్కబద్ధంగా పనిచేయగలుగుతుంది. అప్పుడు బహుశ ప్రేమ అంటే ఏమిటో మీకు తెలుస్తుంది.

సరే, దుఃఖాన్ని అర్థంచేసుకోవాలంటే కాలం అనే ఆ సమస్త ప్రక్రియనూ శోధించి చూడాలి కాలమే దుఃఖం. గతానికి చెందిన దుఃఖమే కాకుండా భవిష్యత్తులో ముడిపడిన దుఃఖం కూడా. గమ్యాన్ని చేరాలనే భావన, సాధించాలనే ప్రయాస, ఏదో ఒక రోజు గొప్పవాడిని అవుతాననే ఆశ, దానితో పాటు అనివార్యంగా వుండే నిరాశా ఛాయలు. ఏదో సాధించాలి, భవిష్యత్తులో గొప్పగా అవాలి అనే ఆలోచనే మానసిక కాలం–ఈ భావనే అన్నింటికంటె పెద్ద దుఃఖం అని నేను అనుకుంటున్నాను. నా పుత్రుడు మరణించాడు. నా భర్త, లేదా నా భార్య నన్ను వదిలి వెళ్ళిపోయారు. నా జీవితం వృధా అయింది. మొదలైనవి కావు. ఇవి చాలా సామాన్యమైనవిగా నాకు తోస్తున్నాయి. ఇట్లా అంటున్నందుకు మీరు అన్యథా భావించరనీ, అపార్థం చేసుకోరనీ ఆశిస్తున్నాను. వీటికంటె చాలా లోతయిన దు:ఖం వున్నది. అదే మానసిక కాలం. రాబోయే సంవత్సరాలలో నేను మారుతాను అని ఆలోచించడం. కొంత సమయం గడుస్తే నాలో పరివర్తన వస్తుంది. నా అలవాట్లని మార్చుకుంటాను. నేను విడుదల పొందుతాను. వివేకాన్ని సంపాదిస్తాను. దైవాన్ని కనుగొంటాను. వీటన్నింటిలోనూ కాలం ఇమిడివున్నది. అదే అత్యంతమైన పెద్ద దుఃఖం అని నాకు అనిపిస్తున్నది. ఈ సమస్యను బాగా లోతుగా విచారించాలంటే, అసలు మన లోపల ఈ దుఃఖం ఎందుకు వున్నది అనేది తెలుసు కోవాలి. పెద్ద అల వంటి ఈ దుఃఖం, ఆ కెరటంలో చిక్కి మనం బంధితులం ఎందుకు అయిపోయాము అనేది కనిపెట్టాలి. మన లోపల వున్న ఒక ప్రత్యేక దుఃఖాన్ని అవగాహన చేసుకోవడం వలన మానవజాతిని నిస్పృహలో ముంచుతున్న ఈ మానవాళి యొక్క సమష్టి శోకాన్ని కూడా బహుశ మనం అవగాహన చేసుకోగలమేమో.

ఎందుకు మనం బాధపడుతున్నాం? దుఃఖానికి ఒక అంతం వున్నదా? బాధ ఎన్నో రకాలుగా వుంటుంది. అనారోగ్యం ఒక రకమైన బాధ. మెదడు బలహీనంగా వుండటం వలన ఆలోచనా శక్తి లోపించడం, ఇంకా ఎన్నో రకరకాలైన శారీరక బాధలూ వున్నాయి. ఇవి కాకుండా మనోవ్యథలు అనే ఆ రంగభూమి అంతా వున్నది. ఒకరు ఫలానాది సాధించలేక పోయారు కాబట్టి, లేదా శక్తిసామర్థ్యాలు లేవు కాబట్టి, అవగాహన లేదు కాబట్టి, తెలివితేటలు లేవు కాబట్టి నిస్పృహకు లోనుకావడం. అంతే కాకుండా పరస్పర విరుద్ధమైన కోరికలూ, తనలో తనకే వైరుధ్యమూ వుండటం, నిరంతరమైన సమరమూ దాని వలన జనించే ఆందోళనలూ, నిరాశలూ కూడా వున్నాయి. ఇవే కాకుండా కాలం ద్వారా, అంటే కాలం గడిచే కొద్దీ తనను మార్చుకోవచ్చు, ఇంతకంటె మెరుగవవచ్చు, వుత్తముడిని అవవచ్చు, వివేకవంతుడిని అవవచ్చు అనే ఒక వూహాభావన కూడా వున్నది. ఇందులో కూడా అంతులేని దుఃఖం ఇమిడివున్నది. ఇక చివరగా మరణం అనే దుఃఖం వున్నది. ఎడబాటు అనే దుఃఖం, ఏకాకిగా అవడం, చాలా చాలా ఒంటరిగా అయిపోవడం అనే దుఃఖం, అన్ని సంబంధాలూ తెగిపోయి, ఏ బాంధవ్యాలూ మిగలని ఆ దుఃఖం కూడా వున్నది.

ఈ రకరకాల దుఃఖాలను గురించి మనందరికీ తెలును. దుఃఖంతో మనం బాధపడుతున్నట్లే గొప్ప గొప్ప పండితులూ, మేధావులూ, మహాపురుషులూ, మత ధర్మపరులూ కూడా అంతటి చిత్రహింసా అనుభవిస్తున్నారు. ఇందులో నుండి బయటపడే మార్గం ఒకటి వున్నట్లయితే ఆ మార్గాన్ని వారూ కనిపెట్టలేదు. మన లోపలకు మనం బాగా లోతుగా శోధించుకున్నప్పుడు, ఈ దుఃఖాన్ని

సమాప్తం చేయడమే మనకు కావలసిన మొట్టమొదటి అంశం అని మనకు తెలుస్తుంది. అయితే అది ఏవిధంగా చేయాలి అనేది మనకు తెలియదు. దుఃఖం గురించి మనకి బాగా తలుసు. ఇతరులలోనూ మనలోనూ కూడా దుఃఖాన్ని చూస్తున్నాము. మనం పీల్చే గాలిలోనే అది ఉన్నది. మీరు ఎక్కడికయినా వెళ్ళండి. ఆశ్రమాలకు వెళ్ళి కూర్చోండి. జనసమ్మర్ధం గల వీధుల్లో నడవండి. అంతటా ఎప్పుడూ దుఃఖం వుంటుంది. బాహాటంగానో, ప్రచ్ఛన్నంగానో పొంచి చూస్తూ వుంటుంది. దారి కాస్తూ వుంటుంది.

మరి, ఈ దుఃఖాన్ని ఎట్లా ఎదుర్కొంటాం? దుఃఖం గురించి మనం ఏం చేయాలి? దాని నుంచి ఎట్లా విడిపించుకుంటాం? పైపై పొరలలో కాదు. పూర్తిగా, సమస్తంగా, ఏమాత్రం దుఃఖం మిగలకుండా సకలమైన దుఃఖవిముక్తి పొందడము అంటే అర్థం మనలో ఇక ప్రేమ వుండదనీ, సానుభూతీ, దయార్ద్రతా వుండవనీ, ఇతరులను అర్థంచేసుకోవడం వుండదనీ కాదు. దుఃఖం నుంచి సంపూర్ణ స్వేచ్ఛ లభించినప్పుడు ఉపేక్షాగుణం వుండనే వుండదు. ఈ స్వేచ్ఛ గొప్ప సున్నితశీలత్వాన్నీ, నిరావృతమైన మనసునూ తీసుకొని వస్తుంది. ఈ స్వతంత్రస్థితికి మనం ఎట్లా చేరతాం? మీ అందరికీ తెలుసు. అది మీకెవరికీ తెలియని కొత్త విషయం కాదు. అది వున్నది. దానిని ఎట్లా సమీపిస్తారు? పైపైనగా మాత్రమే, మాటలలో మాత్రమే దానిని తాకి చూస్తారా?

దయచేసి ఇది శ్రద్ధగా వినండి. అందరమూ కలిసి ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ చివరిదాకా వెళదాం. ఈ వుదయం వేళ సంపూర్ణమైన సావధానతతో మీరు వినగలరేమో చూడండి. మీలో వస్తున్న ప్రతిస్పందనలు గమనించు కుంటూ, దుఃఖం అనే ఈ సమస్యలోకి లోతుగా మనందరమూ వెళ్ళి చూద్దాం. అంటే అర్థం, నన్ను అనుసరిస్తూ నా వెనకాల రమ్మని కాదు. అది చాలా మూర్ఖత్వం. మనం అందరమూ కలిసి దీనిని అవగాహన చేసుకోగలిగితే, విపులంగా ప్రగాఢంగా దీనిని శోధించగలిగితే, అప్పుడు బహుశ ఈ ప్రదేశం వదిలి వెళ్ళాక మీరు హాయిగా ఆకాశం వైపు చూడగలుగుతారు. దుఃఖం మిమ్మల్ని ఇక ఎన్నటికీ స్పృశించలేదు. అప్పుడు ఇక భయం అనేది వుండదు. భయాలు అన్నీ పోయినప్పుడు ఆ అప్రమేయమైనది మీతో పాటుగా నడవవచ్చు.

అందుచేత, దుఃఖాన్ని మీరు ఎట్లా ఎదుర్కొంటారు? మనలో చాలామంది దానిని పైపైనగానే ఎదుర్కుంటున్నామేమో అని నాకు అనిపిస్తున్నది. మన చదువులు, మన శిక్షణ, మన విజ్ఞానం, చుట్టూ వున్న సమాజం మన మీద ప్రసరిస్తున్న ప్రభావాలూ అన్నీ కూడా మనల్ని పైపైనగా బ్రతికే, బోలుగా వుండే విధంగా తయారుచేస్తున్నాయి. ఇట్లా బోలుగా వుండే మనసే చర్చిలలోకి, ఆలయాలలోకీ పారిపోతుంది. ఏదో ఒక అభిప్రాయంలోకో, ఏదో ఒక ప్రతిపాదనలోకో, నమ్మకంలోకో, సిద్ధాంతంలోకో పారిపోతుంది. దుఃఖంలో వున్న బోలు మనసుకు ఇవన్నీ ఆశ్రయాలు. ఏ ఆశ్రయమూ దొరకకపోతే మీ చుట్టూరా మీరే ఒక గోడ కట్టుకొని నిరాశావాదులుగా, కర్కశంగా, నిరాసక్తంగా అయిపోతారు. లేదా అంటే ఒక సునాయాసకరమైన, మతిలేని క్రియని పట్టుకొని అందులో పడి పారిపోతుంటారు. బాధని తట్టుకోవడానికి నిర్మించుకునే ఈ రక్షణ పద్ధతులన్నీ కూడా విచారణలో ముందుకు పోకుండా మనల్ని నిరోధిస్తాయి. నేను చెప్తున్నది మీకు అర్థమవుతున్నదని ఆశిస్తున్నాను. మనలో చాలామంది చేస్తున్న దానిని గురించే నేను చెప్పడం జరిగింది.

సరే, బోలుగా పనిచేసే ఒక మనసుని లేక ఒక మెదడుని పరిశీలించండి. దయచేసి నేను మనసు అనే మాటని వుపయోగించినా, మెదడు అనే మాటని వుపయోగించినా ఒకటే అని గ్రహించండి. ఇంతకు మునుపు ఒక రోజు మెదడునీ మనసునీ విడివిడిగా నేను పరిశీలించి చెప్పడం జరిగింది. అయితే ఆ విభజన కేవలం మాటలకు పరిమితం; ప్రస్తుతం మనకు అది అనవసరం, మనసు అనే మాటనే నేను వుపయోగించబోతున్నాను. నేను చెప్తున్నది మీకు అర్థమవుతుందనీ, గ్రహిస్తారనీ ఆశిస్తున్నాను.

బోలు మనసు దుఃఖం అనే ఈ సమస్యను పరిష్కరించలేదు. ఎందుకంటే దాని ప్రయత్నమంతా దుఃఖం నుంచి తప్పించుకొని తిరగాలనే. దుఃఖం నుంచి త్వరగా సులభంగా తీసుకొనే ఒక ప్రతిచర్యద్వారా అది తప్పించుకొని పారిపోతుంది. చాలా తీవ్రమైన పంటినొప్పితో బాధపడుతున్నప్పుడు వెంటనే ఒక దంతవైద్యుని వద్దకు మీరు వెళ్ళడం సహజం. ఎందుకంటే ఆ శరీరబాధను తొలగించుకోవాలని మీరు కోరుకుంటారు కాబట్టి. ఇది చాలా సాధారణమైన సవ్యమైన ప్రతిస్పందన. కానీ, మనోవ్యథ ఇంతకంటే లోతయినదీ, ఇంతకంటే సూక్ష్మగ్రాహ్యమైనదీ. దీనిని ఏ వైద్యుడూ, ఏ మనోవైజ్ఞానికుడూ, ఎవరూ పరిష్కరించలేరు. అయినా కూడా, తక్షణమే మీలో జరిగే ప్రతిస్పందన ఏమిటంటే ఆ బాధ నుంచి దూరంగా పారిపోవడం. రేడియో తిప్పుతారు. టెలివిషన్ చూస్తారు. సినిమాకి వెళతారు. ఆధునిక నాగరికత సృష్టించిన వినోద కాలక్షేపాలు ఏమిటో అవన్నీ మీకు తెలుసు. ఏ రకమైన వినోద కార్యక్రమమైనా, దేవాలయంలో పూజాప్రార్థనలయినా, ఫుట్‌బాల్ ఆట అయినా అన్నింటి సారాంశమూ ఒకటే. అది మీ లోపల వున్న దైన్యస్థితి నుంచి, మీ ఖాళీతనం నుంచి పారిపోయే మార్గం మాత్రమే అవుతుంది. ప్రపంచమంతటా అన్ని చోట్లా కూడా మీరందరూ చేస్తున్నది ఇదే. మిమ్మల్ని మీరు మరిచిపోవడానికి రకరకాలయిన కుప్పిగంతులు వేస్తుంటారు.

అదేవిధంగా బోలు మనసే భాష్యాలూ, వ్యాఖ్యానాలూ తెలుసుకోవాలని ప్రయత్నిస్తూ వుంటుంది. "నేను ఎందుకు బాధపడుతున్నానో తెలుసుకోవాలనుకుంటున్నాను. నేనే ఎందుకు బాధపడాలి, నీవు ఎందుకు పడటం లేదు?" అని అంటుంది. ఈ జన్మలో తను పెద్దగా ఏ తప్పు చేయలేదని ఆ మనసు అనుకుంటుంది. అందుకని గతజన్మలు అనే సిద్ధాంతాన్ని, ఇండియాలో దీన్నే కర్మ అని అంటారు– కార్యకారణాలు అనే ఆ ప్రతిపాదనని ఆ మనసు ఆమోదిస్తుంది "గతంలో ఏదో తప్పుచేశాను. దానికి ఇప్పుడు పరిహారం చెల్లిస్తున్నాను" అని అంటుంది. లేదా "ఇప్పుడు నేను మంచి చేస్తున్నాను. దీని సత్ఫలితం భవిష్యత్తులో నాకు లభిస్తుంది" అని అంటుంది. అందుచేత బోలుగా వుండే మనసు ఈ భాష్యాలలో, వ్యాఖ్యానాలలో చిక్కుకొనిపోతుంది.

దయచేసి మీ మనసునే మీరు గమనించండి. వ్యాఖ్యానాలతో మీ దుఃఖాన్ని ఏవిధంగా సర్దివుచ్చుకుంటారో మీరే పరిశీలించండి. పనిలోనో, భావాలను అల్లుకోవడంలోనో పడి మిమ్మల్ని మీరు మరచిపోవడమూ, దేవుడిలోనో భవిష్యత్తులో మరో జన్మపైనో నమ్మకాన్ని పట్టుకొని వేళ్ళాడటమూ మీరే పరిశీలించుకోండి. ఒకవేళ వ్యాఖ్యానాలూ నమ్మకాలూ మీకు సంతృప్తికరంగా లేకపోతే మద్యపానం ద్వారానో సెక్స్ ద్వారానో పారిపోవాలని చూస్తారు. లేదా అంటే అతి నిరాశావాదిగా తయారై, కఠినంగా కర్కశంగా మొండిగా అయిపోతారు. ప్రతివారిలోనూ వ్యక్తరూపంలోనో అవ్యక్తంగానో నిజంగా జరుగుతున్నది ఇదే. కానీ దుఃఖం చేసే గాయం చాలా లోతుగా వుంటుంది. ఒక తరం తరువాత ఇంకొక తరానికి తల్లిదండ్రులు దీనిని అందిస్తూనే వున్నారు. బోలు మనసు ఈ గాయానికి కట్టిన పట్టీని తీసివేయకుండా ఎప్పటికీ అట్లాగే వుంచుతుంది. దానికి దుఃఖం నిజంగా తెలియదు. దుఃఖంతో దానికి వాస్తవంగా పరిచయం లేదు. దుఃఖం గురించి ఒక వూహగా తెలుసు. దానిని గురించి ఒక బొమ్మ, ఒక సంకేతం మనసు వద్ద వుంటాయి. అంతేకాని

☞ 6

(*1వ పేజీ తరువాయి*) . . .

## ఏ అంశాన్నైనా, అందులో వున్న సమస్తాన్నీమానసికంగా పూర్తిగా గ్రహించుకోగలుగుతామా?

చూడగలుగుతాం కదూ? ఈ విషయాన్ని మీరు బాగా విస్తృతంగా పరిశీలించి స్పష్టపరుస్తారని ఆశిస్తున్నాను. ఇది చాలా ముఖ్యమైన అంశం అని నేను అనుకుంటున్నాను. ఎందుకంటే జీవితంలోని అనేకానేక విషయాలకు బహుశ ఇది ఒక కీలకం వంటిది అని అనిపిస్తున్నది. నన్ను నేను కనుక పూర్తిగా సమస్తంగా అర్థంచేసుకుంటే అప్పుడు బహుశ నా సమస్యలన్నీ పరిష్కారమై పోతాయి. అప్పుడు నేను వున్నతమాన వుడినైపోయి సంతోషంగా వుంటానేమో. ఈ విషయం గురించి మాట్లాడుతుంటేనే సమస్యలతో, వ్యథలతో కూడిన నా అల్పప్రపంచానికి అతీతంగా వెళ్ళడం సాధ్యమే అనే వుత్సాహం నాలో పరవళ్ళు తొక్కుతున్నది. అందుచేత, గ్రహించడం-చూడటం అంటే మీ అర్థం ఏమిటసలు? తనను తాను సంపూర్ణంగా చూసుకోవడం ఎవరికైనా సాధ్యమా?

**కృష్ణమూర్తి:** విషయాలను మనం ఎప్పుడూ పాక్షికంగానే చూస్తుంటాం. మొదటి సంగతి ఏమిటంటే మనలో సావధానత లేకపోవడం. రెండోది ఏమిటంటే, చూస్తున్న విషయాలను గురించిన అపోహలతో, మాటలతో నిర్మించిన ఊహాచిత్రాలతో, మానసికమైన కాల్పనిక బింబాలతో ఆ విషయాల వైపు చూస్తుంటాం. అందుచేత దేనినీ మనం పూర్తిగా చూడటం లేదు. ప్రకృతిని కూడా వస్త్వాత్మకంగా, తటస్థంగా చూడటం చాలా కఠినమైన పని. ఒక పూవు వైపు ఆ పూవు గురించిన వూహాబింబం ఏదీ లేకుండా, దానిని గురించిన వృక్షశాస్త్ర పరిజ్ఞానం ఏదీ లేకుండా చూడటం – వూరికే పరిశీలించడం చాలా కష్టమైపోతుంది. ఎందుకంటే మన మనసు ఎప్పుడూ ఒక దానిపై ఆసక్తి లేకుండా అటూ ఇటూ సంచారం చేస్తూ వుంటుంది. ఒక వేళ మనసుకు ఆసక్తి వున్నా ఆ పూవు వైపు ఒక రకమైన ప్రశంసతోనో, వాచ్యరూపంలో వర్ణనతోనో చూస్తుంది. ఈ రకంగా చూడటం పరిశీలకునిలో ఆ పూవును నిజంగానే పరికించినటువంటి భావం కలుగజేస్తుంది. ప్రయత్నపూర్వకంగా పనిగట్టుకొని పరికించడం చూడటం కానే కాదు. అందుచేత పూవుని ఎన్నడూ పరికించి చూడనే చూడం. పూవువైపు ఒక మనోబింబం ద్వారా చూస్తాం. మనల్ని అంత గాఢంగా తాకని విషయాన్ని చూడటం చాలా వరకు సులభంగానే వుంటుంది. సినిమాకు వెళ్ళామనుకోండి. ఆ క్షణంలో మనల్ని కొంత కదిలించినట్లు అనిపించినా త్వరలోనే అది మరచిపోతాం. అయితే మనల్ని మనం ఏ ఊహాబింబమూ లేకుండా పరిశీలించడం – ఊహాబింబం అంటే గతమూ, మనం సేకరించుకున్న అనుభవమూ, జ్ఞానమూ అన్న మాట – ఇట్లా చూసుకోవడం చాలా అరుదుగా జరుగుతుంది. మన గురించి మనకు ఒక ఊహాచిత్రం వుంటుంది. మనం ఇట్లా వుండాలి, ఇట్లా వుండకూడదు అని అనుకుంటాం. మనల్ని గురించి మనవే ఒక వూహను ముందే నిర్మించుకొని వుంటాం. దీనిలో నుండి మన వైపు మనం చూసుకుంటాం. మనం చాలా వుత్తములం అనో లేదా నీచులం అనో అనుకుంటాం. అసలు నిజంగా మనం ఏమిటి అన్నది చూసుకున్నప్పుడు క్రుంగిపోవడమో భయపడటమో జరుగుతుంది. అందుచేత మన వైపు మనం చూసుకోలేక పోతాం. చూసుకున్నప్పుడు ఆ చూపు తప్పకుండా పాక్షికంగానే వుండి సగం పరిశీలనే అవుతుంది. పాక్షికంగా, సగంసగంగా వుండే పరిశీలన వల్ల అవగాహన జరగదు. మనల్ని మనం పూర్తిగా, వున్న సమస్తమైన దానినీ చూసుకోగలిగినప్పుడు మాత్రమే మనం పరిశీలిస్తున్న ఆ అంశం నుండి విముక్తి లభించే అవకాశం వున్నది. గ్రాహ్యత అనేది కేవలం ఒక్క కళ్ళతోనే కాదు, మన ఇంద్రియాల తోనే కాదు, మనసుతో కూడా ఇక ఈ మనసేమో బాగా గట్టిగా నిబద్ధీకరించబడి వుంటుంది. కాబట్టి మేధాపరమైన గ్రాహ్యత అంటే పాక్షికమైన గ్రాహ్యత. అయినా సరే ఈ మేధతో చూసి గ్రహించడం అనేది మనలో చాలా మందికి తృప్తికరంగానే వుంటున్నది. దానితో మనకు అర్థమైపోయింది అని అనుకుంటాం. ఇట్లా కొంత భాగాన్ని మాత్రమే అర్థంచేసుకోవడం మహా ప్రమాదకరమైనది. విధ్వంసపూరితమైనదీ కూడా. ఇప్పుడు ప్రపంచమంతటా జరుగుతున్నది ఇదే. రాజకీయవేత్తలు, మతాచార్యులు, వ్యాపారవేత్తలు, సాంకేతిక ప్రవీణులు, చివరకు కళాకారులు కూడా – అందరూ ఇట్లా పాక్షికంగానే పరిశీలిస్తున్నారు. కాబట్టి వీరంతా కూడా మహా విధ్వంసకారకులు. వీరంతా ప్రపంచంలో ప్రముఖపాత్ర వహిస్తూ, ప్రముఖ స్థానాల్లో వున్నారు కాబట్టి ఈ పాక్షిక దృష్టి-గ్రహింపు అందరూ ఆమోదించే ప్రామాణికతను సంపాదించింది. మనిషి ఇందులో చిక్కుకొనిపోయి వున్నాడు. మనలో ప్రతి ఒక్కరమూ కొంతకొంతగా రాజకీయవేత్తలం, వ్యాపారవేత్తలం, కళాకారులమూ కూడా. ఇట్లాగేశకలాలుగా విచ్ఛిన్నమైపోయిన జీవులం. ప్రతి ఒక్కరమూ భిన్నభిన్న అభిప్రాయాలూ, తప్పు ఒప్పు అంటూ చేసే తీర్పులూ పరస్పరం సంఘర్షించుకుంటున్న రణరంగాలమే.

ఈ పుస్తకం చదివారా?
**'అనాది స్రోతస్సు'**
రాజఘాటు (వారణాసి)లో
**జె. కృష్ణమూర్తి** ప్రసంగాలు,
చర్చలు, సంభాషణలు
అనువాదం: **అరుణా మోహన్**
**వసంత విహార్**
**(కృష్ణమూర్తి ఫౌండేషన్ ఇండియా)లోను**
**విశాలాంధ్ర వారి విక్రయశాలల్లోను**
**లభ్యమవుతుంది.**

**ప్ర:** చాలా స్పష్టంగా అది చూస్తున్నాను. ఈ చూడటం అనే మాటను మేధాపరంగానే వుపయోగిస్తున్నాననుకోండి.

**కృ:** అదంతా సంపూర్ణంగా సమస్తంగా కనుక చూస్తే – మేధాపరంగా కాకుండా వాచ్యరూపంలో కాకుండా, ఉద్వేగపూరితంగా కాకుండా కనుక చూస్తే, అప్పుడు చర్యతీసుకుంటారు. అప్పుడు పూర్తిగా ఒక విభిన్నతరహా అయిన జీవితాన్ని గడుపుతారు. చాలా ప్రమాదరకమైన కొండ అంచు మీద వున్నారనుకోండి; లేదా ప్రమాదకరమైన మృగం మీ ఎదురుగా వచ్చిందనుకోండి. అప్పుడు పాక్షికమైన అవగాహన వుండదు. పాక్షికమైన చర్య జరగదు. అప్పుడు సంపూర్ణమైన చర్య వుంటుంది.

**ప్ర:** కాని మన జీవితాల్లో ప్రతి ఒక్క క్షణమూ ఇటువంటి ప్రమాదకరమైన విపత్తులను మనం ఎదుర్కోవడం లేదు కదా?

**కృ:** అటువంటి ప్రమాదరకమైన విపత్తులు మన ఎదురుగా నిరంతరమూ వసత్తానే వున్నాయి. మీరు వాటికి అలవాటు పడిపోయారు. లేదా అంటే చూసీ చూడనట్లు వుపేక్షిస్తున్నారు. లేదా ఆ సమస్యల పరిష్కారాన్ని ఇతరులెవరికో వదిలేస్తున్నారు. ఆ ఇతరులు కూడా ఇట్లాగే కళ్ళు మూసుకొనిపోయీ ఇట్లాగే వంకర దృష్టితోనూ వున్నారు.

**ప్ర:** అయితే ఈ విపత్తులను గురించి ఎప్పుడూ ఎరుకతో నేను వుండాలంటే ఎలా? అసలు ఈ విపత్తులు ఎప్పుడూ వుంటూనే వుంటాయని మీరు ఎందుకంటున్నారు?

**కృ:** ప్రతి ఒక్క క్షణంలో సమస్తమైన జీవితం వున్నది. ప్రతి క్షణమూ ఒక సవాలు. ఈ సవాలుకు తగినంతగా స్పందించకపోవడం, సగంసగంగా ఎదుర్కోవడమే మన బ్రతుకుల్లోని విపత్తు, కల్లోలమూ. వీటిని విపత్తులుగా చూడటం మనకు ఇష్టం వుండదు. వాటి నుంచి

☞ 5

తప్పించుకోవడం కోసం కళ్ళు మూసుకుంటాం. అందుచేత ఇంకా అంధులవైపోయి ఈ విపత్తులను ఇంకా పెద్దవి చేసుకుంటాం.

**ప్ర:** అయితే సమస్త సంపూర్ణమైన పరిగ్రాహ్యత నాకు ఎలా వస్తుంది? నేను పాక్షికంగా చూస్తున్నాను అనే సంగతి నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నది. నా వైపు, ఈ ప్రపంచం వైపు పరిపూర్ణమైన గ్రాహ్యదృష్టితో చూడటం లోని ప్రాధాన్యత కూడా అర్థమవుతున్నది. కానీ నాలోపల ఎన్నెన్నో జరిగిపోతుంటే, అసలు దేనిని చూడాలి అనేది నిర్ణయించడం కష్టమైపోతున్నది. గోలగోలగా ఎగురుతున్న కోతులతో నిండిన ఒక పెద్ద బోనులా వున్నది నా మనసు.

**కృ:** ఏ ఒక్క చలనాన్ని అయినా సరే సంపూర్ణంగా చూసినట్లయితే ఆ సంపూర్ణత లోనే అన్ని కదలికలూ వుంటాయి, ప్రతి ఒక్క చలనమూ వుంటుంది. ఒక్క సమస్యను కనుక మీరు పూర్తిగా అవగాహన చేసుకున్నట్లయితే సమస్తమైన మానవ సమస్యలను అర్థంచేసు కుంటారు. ఎందుకంటే అవన్నీ పరస్పర సంబంధం కలవి. అందుచేత ప్రశ్న ఏమిటంటే: ఒక్క సమస్యను మనం సంపూర్తిగా అర్థం చేసుకోగలమా, చూడగలమా, గ్రహించగలమా – ఎంతలా అంటే ఆ అవగాహనలో నుండి తక్కిన అన్నీ మనకు అర్థమైపోయేలా. ఈ సమస్యను అది జరుగుతున్నప్పుడే చూడాలి. అంతకు మునుపూ కాదు, తరువాతా కాదు. ఒక జ్ఞాపకంలానో, ఒక దృష్టాంతంలానో చూడటం కాదు. ఉదాహరణకి, ఇప్పుడు ఇక్కడ కూర్చుని మనం కోపం గురించి కాని, భయం గురించి కాని పరిశీలించాలను కుంటే లాభంలేదు. అవిపుట్టుకొని వస్తూ వున్నప్పుడే వాటిని చూడటం సరియైనది. పరిగ్రాహ్యత తక్షణమే జరుగుతుంది. ఒక అంశం మనకు వెంటనే అప్పటికప్పుడే అర్థమవుతుంది. లేదా అంటే అసలు అర్థమే అవదు. చూడటము, వినడము, అర్థంచేసుకోవడము ఆ క్షణంలో అప్పటికప్పుడు జరుగుతాయి, వినడంలో చూడటంలో వ్యవధానం అనేది వుంటుంది.

**ప్ర:** నా సమస్య ఇంకా తీరలేదు. సమస్యకు కొంత కాల వ్యవధి వుంటుంది. చూడటం వెంటనే అప్పటికప్పుడు జరుగుతుందని, అందుచేత అది కాలంలో వుండదనీ మీరు అంటున్నారు. అసూయ, ఇంకా అటువంటి ఇతర అలవాట్లకు కాల వ్యవధిని ఇస్తున్నది ఏమిటి?

**కృ:** ఎందుకని అవి సాగిపోతూ వుంటాయి? ఆగిపోకుండా? ఎందుకంటే వాటి వైపు మీరు సున్నితశీలంతో, ఎంపికలేని ఎరుకతో, తెలివితో చూడలేదు కాబట్టి. కాదూ? పాక్షికంగా మాత్రమే వాటిని చూశారు. కాబట్టే వాటిని అట్లాగే కొనసాగనిచ్చారు. దీనికి తోడు, వాటిని పోగొట్టుకోవాలి అని కోరుకోవడం కూడా వ్యవధిని తయారు చేసి మరో సమస్య అవుతున్నది. ఏ విషయంతో నైనా సరే వ్యవహరించడానికి సరిపడినంత సామర్థ్యం లేనప్పుడు అది ఒక సమస్యగా అవుతుంది. దానికి కాలవ్యవధి ఏర్పడుతుంది. దానికో జీవితకాలాన్ని ఇస్తుంది.

**ప్ర:** కానీ సమస్త విషయాన్ని తక్షణమే అప్పటికప్పుడే చూడటం ఎలా? ఇక అది మళ్ళీ తిరిగి రాకుండా దానిని నేను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం ఎలా?

**కృ:** మీరు గట్టిగా నొక్కి చెప్తున్నది ఇక ఎప్పటికీ *గురించా?* అవగాహన గురించా? ఇక ఎప్పటికీ అన్న దానిని నొక్కి చెప్తుంటే కనుక మీరు దీనినుండి శాశ్వతంగా తప్పించు కోవాలను కుంటున్నారని అర్థం అంటే రెండవ సమస్య పుట్టుకొస్తున్నదనమాట. అందుచేత మన ప్రశ్న ఒక్కటే ఒక్కటి. అది ఏమిటంటే-సమస్యను సంపూర్తిగా ఎట్లా చూడాలి? అట్లా చూడటం వల్ల ఆ సమస్య నుండి విముక్తి లభిస్తుంది కాబట్టి. పరిగ్రాహ్యత ఎప్పుడూ నిశ్శబ్దంలోనే సంభవిస్తుంది. వాగుతున్న మనసులో కాదు. ఈ వాగుడు పోగొట్టుకోవాలని కోరుకోవడం, తగ్గించాలనుకోవడం, తప్పించుకోవాలను కోవడం, అణచివేయాలనుకోవడం, దానికి బదులు మరేదైనా ఆ స్థానంలో పెట్టాలనుకోవడం – ఏదైనా సరే అదంతా మనసు వాగుడే. అయితే, ప్రశాంతంగా వున్న మనసు మాత్రమే చూడగలుగుతుంది.

**ప్ర:** ప్రశాంతమైన మనసు నాకు ఎలా లభిస్తుంది?

**కృ:** ప్రశాంతమైన మనసు మాత్రమే చూడగల సత్యాన్ని మీరు చూడటం లేదు. ప్రశాంతమైన మనసును ఎట్లా సాధించాలి అనే ప్రశ్నే లేదు. మనసు నెమ్మదించాలి అనేది సత్యం. ఇందులో వున్న నిజాన్ని చూడటం మనసును వాగుడు నుంచి విడిపిస్తుంది. అప్పుడు గ్రాహ్యత- అంటే అదే తెలివి-పనిచేయడం ఆరంభిస్తుంది. అంతేకాని నేను చూడాలి కాబట్టి నేను నిశ్శబ్దంగా వుండాలి అనే ప్రతిపాదన కాదు. అయితే ప్రతిపాదన కూడా పని చేయగలదు. కానీ అది పాక్షికమైనది. ఒక కొంత భాగం మాత్రమే పనిచేయడం వంటిది. పాక్షికమైన దానికీ సమస్తసంపూర్ణానికీ మధ్య ఏ సంబంధమూ వుండదు. పాక్షికమైనది ఎదిగి (పెరిగి) సమస్తంగా అవలేదు. అందుచేత చూడటం చాలా అత్యంత ప్రధానమైన సంగతి. చూడటం అంటే సావధానత. సావధానత లేకపోవడం. పరధ్యాసలో పడటమే సమస్యకు దారితీస్తుంది.

**ప్ర:** ఎప్పుడూ సావధానతతో వుండటం ఎలా? ఎల్లప్పుడూ సావధానంగా వుండటం అసాధ్యం!

**కృ:** నిజమే. అది అసాధ్యం. అయితే మీరు పరధ్యాసలో వున్నారు, సావధానతతో లేరు. అనే ఎరుకతో వుండటమే అత్యంత ప్రధానమైన విషయం. అంతే తప్ప ఎప్పుడూ సావధానతతో వుంటం ఎట్లా అన్నది కాదు. 'నేను ఎప్పుడూ సావధానతతో వుండటం ఎట్లా' అనే ప్రశ్నను అత్యాశ అడుగుతుంది. సావధానతతో వుండటం అనేదాన్ని మీరు సాధన చేస్తుంటే ఇక మీరు దారి తప్పిపోయినట్లే. సావధానతతో వుండటం కోసం చేసే సాధనే పరధ్యాసలో పడటం. అందంగా వుండటం, ప్రేమించడం సాధన చేసి పొందేవి కావు కదా. ద్వేషం అంతమైనప్పుడు ఆ మరొకటి వుంటుంది. మీ సమస్తమైన సావధానతను ద్వేషం ఎడల చూపినప్పుడే, ద్వేషం గురించిన జ్ఞానం పోగుచేసుకోకుండా ద్వేషం గురించి నేర్చుకుంటున్నప్పుడు మాత్రమే ద్వేషం ముగిసిపోతుంది. ఎంతో సామాన్యంగా ఆరంభించండి.

**ప్ర:** మీరు చెప్పినది విన్న తరువాత మేము చేయవలసిన సాధన ఏదీ లేదు అని అంటుంటే, అప్పుడు మీరు అసలు మాట్లాడటం ఎందుకు?

**కృ:** వినడమే అత్యంత ప్రధానమైన సంగతి. అంతేకాని ఆ తరువాత మీరు ఏం సాధన చేస్తున్నారు అనేది కాదు. వినడం తక్షణమే అప్పటికప్పుడు జరిగే క్రియ. సాధన సమస్యలకు వ్యవధి కాలాన్ని ఇస్తుంది. సాధన అంటే సంపూర్ణమైన పరధ్యాస. నిరవధానత, సావధానత లేకపోవడం. సాధన చేయనే వద్దు. పొరబాట్లను మాత్రమే మీరు సాధన చేయగలుగుతారు. నేర్చుకోవడం ఎప్పుడూ కొత్తగా జరుగుతుంది.

*('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి, అధ్యాయం – పరిగ్రాహ్యత)* ■


## కొత్త పుస్తకం
## మీరు చదువుకుంటున్నది ఎందుకోసం?

విద్యార్థులకు, పెద్దలకు
అందరికీ ఆసక్తి గొలిపే
ఆరు ప్రసంగాలు
భారతీయ విశ్వవిద్యాలయాల్లో
**జె. కృష్ణమూర్తి**
ఇచ్చిన ప్రసంగాలు
అనువాదం: **పిడూరి రాజశేఖర్**
**వెల: రు. 60/-**
**విశాలాంధ్ర వారి విక్రయశాలల్లో**
**వసంతవిహార్, చెన్నైలో లభ్యమవుతుంది**

# కృష్ణజీతో ఒకరోజు

ఒక జైన సాధువు కృష్ణజీ వద్దకు వచ్చి అడిగాడు; "సర్, పధ్నాలుగు సంవత్సరాలుగా ధ్యానం చేస్తూ, దానికే నన్ను అంకితం చేసుకున్నాను. అయినా 'సమాధి' స్థితిని అందుకోలేకపోతున్నాను. ధ్యానాన్ని సాధన చేస్తూనే వున్నాను కాని గాఢమైన లోతులకు వెళ్ళలేకపోతున్నాను. ఎప్పటికైనా చేయగలుగుతానా? నాకు గల ప్రతిబంధకాలేమిటో మీరు చెప్పగలరా?"

అతడు అనుసరిస్తున్న ధ్యాన విధానాలను గురించి చెప్పమని కృష్ణజీ అడిగి తెలుసుకున్నారు. విన్నాక ఇలా అన్నారు. "మీరు ఇంకా అన్నీ ఆర్జించి సేకరించుకుంటూనే ఉన్నారనే విషయం మీరు గ్రహించారా? పిడికిలి తెరవండి. సేకరించవలసినది ఏమీ లేదు."

కొన్ని నిముషాల సేపు సాధువు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఆ తరువాత లేచి కృష్ణజీకి సాష్టాంగ ప్రణామం చేశాడు. అతడిని కొంతసేపు అలాగే ఉండిపొమ్మని కృష్ణజీ అన్నారు.

కొంతసేపయాక సాధువు "సర్, మరొక్క ప్రశ్న అడగాలనుకుంటున్నాను. నాకు ఈ అనుభూతిని కలగజేసింది మీ వ్యక్తిత్వంలో ఉన్న శక్తే కదూ? ఇది మీరు ప్రసరించిన గురు కృపకదా?" అన్నాడు.

"ఈ ప్రశ్న మీరు వేస్తారని నాకు తెలుసు. అందుకే మరికొంత సేపు అలాగే ఉండిపొమ్మని కోరాను. ఇది ఆర్జించుకొని అట్టేపెట్టుకొనేది కాదు. ఇది త్యజించవలసినది. మీ పిడికిలి తెరిచివేయండి. అన్నీ వదిలేయండి'' అని సమాధానం ఇచ్చారు కృష్ణజీ.

ఒకక్షణం ఆగి మళ్ళీ అన్నారు. "ఈ ప్రశ్నను అడుగుతున్నది కొత్త మనసేనా? లేక ఈ అనుభవం జరగక మునుపు గల, ప్రశ్నలతో నిండిపోయి వున్న మనసా? మీరు మళ్ళీ అందులో చిక్కుకొని పోయారు. మిమ్మల్ని అందులోనుండి బయటకు లాగాను. కాని మీరు మళ్ళీ అందులోకే వెళ్ళిపోయారు. గట్టిగా నిలబడిపోయి, అన్నింటినీ మీరు జారవిడిచేస్తే 'అది' వస్తుంది. మీరు కావాలంటున్నారు కాబట్టి 'అది' రాదు. అయితే 'అది, వస్తుంది."

''ఆ మరొకటి కాలానికి వెలుపలగా ఉంటుంది. మనమేమో కాలంలో జీవిస్తుంటాం. కాలరహితమైన దానిని కాలంలోకి తీసుకురావాలని కోరుకుంటాం. ఇదంతా నేను మీతో చెప్పాను కానీ ఇది నాది కాదు."

*(సునంద పట్వర్ధన్ రచన 'ఏ విషన్ ఆఫ్ ది సేక్రెడ్' నుండి)* ■

*(3వ పేజీ తరువాయి) . . .*

## దుఃఖ సమాప్తి

### "మన అందరిలోనూ దుఃఖం వున్నది"

మనసు ఎన్నడూ దుఃఖాన్ని కలవదు, తాకదు. దుఃఖం అనే ఆ మాటని మాత్రమే అది ఎదుర్కొంటుంది. మీకు అర్థమవుతున్నది కదూ? దుఃఖం అనే ఆ మాట మనసుకు తెలుసు. కాని దుఃఖం దానికి తెలుసును అని నేను గట్టిగా చెప్పలేను.

'ఆకలి' అనే మాట తెలిసివుంటం వేరు, వాస్తవంలో మనకి ఆకలివేయడం వేరూ. రెండూ భిన్నమైన విషయాలు. అవునా కాదా? మీకు ఆకలి వేస్తుంటే 'ఆహారం' అనే ఆ మాట మీకు తృప్తినివ్వదు. మీకు కావలసినది ఆహారం. ఆ వాస్తవ పదార్థం. ఇప్పుడు, మనలో చాలామంది మాత్రం మాటలతో, సంకేతాలతో, చిహ్నాలతో, ఊహలతో, ఆ మాటలకు మనలో కలిగిన ప్రతిచర్యతో సంతృప్తి పడిపోతూ వుంటాం. పూర్తిగా వాస్తవంతోనే వుండటం జరగనే జరగదు. ఆకస్మాత్తుగా దుఃఖం అనే వాస్తవంతో మనం ముఖాముఖిగా వచ్చినప్పుడు, అది మనకు దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. దానికి మన ప్రతిచర్య ఏమిటంటే అక్కడినుంచి పారిపోవడం. ఇది మీరు గమనించారో లేదో నాకు తెలియదు. దయచేసి మీ మనోస్థితినే గమనిస్తూ వెళ్ళండి. ఇక్కడ చెప్తున్న మాటలను మాత్రమే వింటూ కూర్చోకండి. దుఃఖాన్ని మనం నేరుగా ఎప్పుడూ ఎదుర్కోము. దానితో కలిసి జీవించము. చిత్రించుకున్న ఒక బొమ్మతో, ఒకప్పుడు వున్నదాని స్మృతితో మనం జీవిస్తుంటాము. వాస్తవంతో కాదు. మనం జరిపే ప్రతిచర్యతో జీవిస్తుంటాం.

సరే, మనసు ఒక ప్రయోజనాన్ని ఆశించి దుఃఖాన్ని ఎదుర్కొంటుంటే, అంటే దుఃఖం గురించి ఏదయినా చేయాలని మనసు కోరుకుంటుంటే, అప్పుడు దుఃఖాన్ని అవగాహన చేసుకోవడం సాధ్యం కాదు. ఎట్లా అయితే ప్రేమించడం వెనక ఒక వుద్దేశ్యం పెట్టుకొనివుంటే కనుక అప్పుడు ప్రేమ వుండనే వుండదో ఆ విధంగానే. మీకు అర్థం అవుతున్నది కదూ? మనలో చాలా మందిమి ఒక వుద్దేశ్యం పెట్టుకొని దుఃఖం వైపు చూస్తాం. దానిని గురించి ఏదయినా చేయాలనుకుంటాం. అంటే, నాకు సన్నిహితులు ఎవరయినా మరణించారనుకోండి. ఆ మరణించిన వారి వద్దనుండి మానసికంగా, ప్రగాఢంగా నాకు కావలసినది ఏదీ ఇక లభించదు. అందుచేత నాకు దుఃఖం కలుగుతుంది. నా దుఃఖం వైపు చూస్తున్నప్పుడు నాలోపల ఏ వుద్దేశ్యమూ కనుక లేకపోతే అప్పుడు అది దుఃఖంగానే వుంటుందా? లేక దుఃఖం అప్పుడు చాలా విభిన్నంగా మరొకలాగా అవుతుందా? ఇది మీరు శ్రద్ధగా వింటున్నారా?

నా పుత్రుడు చనిపోయాడని అనుకుందాం. నేను ఒంటరిగా మిగిలిపోయాను కాబట్టి నాకు దుఃఖం కలుగుతుంది. నా ఆశలన్నీ అతడి మీద పెట్టుకున్నాను. ఇప్పుడు నా ప్రపంచం సర్వస్వం కూలిపోయింది. నా కొడుకు ద్వారా ఒక రకమైన శాశ్వతత్వాన్నీ, ఒక కొనసాగింపును నెలకొల్పుకోవాలని నేను కాంక్షించాను. అతడి ద్వారా నా పేరు ఎప్పటికీ నిలిచిపోయి వుండేది.

*(తక్కినది వచ్చే సంచికలో)*

*Published in August, December & April* Periodical
*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028. Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*